RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో
తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు
విలేకరులు కావలెను
జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.
9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD సంపుటి : 10 సంచిక : 328 సోమవారం 30 - 06 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## వారిని వదిలేది లేదు..
# కేంద్రమంత్రి అమిత్ షా

- నిజామాబాద్‌లో కేంద్రమంత్రి అమిత్ షా పసుపు బోర్డును ప్రారంభించారు
- 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కలను ప్రధాని మోదీ నెరవేర్చారని అన్నారు
- పహల్గాం ఘటనకు ప్రతీకారంగా పాకిస్థాన్ మూకలకు బుద్ధి చెప్పామన్నారు



హైదరాబాద్ : నిజామాబాద్‌లో కేంద్రమంత్రి అమిత్ షా పసుపు బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కలను ప్రధాని మోదీ నెరవేర్చారని అన్నారు. పసుపు బోర్డు ఇక్కడికి రావడంలో రాష్ట్ర బీజేపీ ఎంపీల కృషి చాలా ఉందన్నారు. నిజామాబాద్ పసుపు ప్రపంచ మార్కెట్ లోకి వెళ్తుందని, పసుపు ధర పెరుగుతుందని, వ్యాపారాలు పెరుగుతాయని వ్యాఖ్యానించారు. మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్ ఆఫీస్ కూడా నిజామాబాద్‌లో ఉంటాయని, వివిధ దేశాలకు ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. పహల్గాం ఘటనకు ప్రతీకారంగా పాకిస్థాన్ మూకలకు బుద్ధి చెప్పామన్నారు. ఈ నేపథ్యంలోనే.. నక్సల్స్ ఆయుధాలు పక్కన పెట్టి లొంగిపోవడం మంచిదని సూచించారు. నక్సల్ కు వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆయుధాలు పట్టిన వారిని వదిలేది లేదని హెచ్చరించారు.

మిగతా..2లో

## తెలంగాణలో ఈదురుగాలులతో వానలు
# హెచ్చరించిన ఐఎండీ

- మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది
- తెలంగాణలో మూడురోజులు వానలు కొనసాగుతాయని చెప్పింది
- సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని



హైదరాబాద్ : రాగల మూడురోజులు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర గుజరాత్ మీదుగానున్న ఉపరితల ఆవర్తం నుంచి వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌ఘడ్, ఉత్తర ఒడిశా మీదుగా అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతూ.. సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణ దిశగా వంగి ఉందని తెలిపింది. తెలంగాణలో మూడురోజులు వానలు కొనసాగుతాయని చెప్పింది. ఆదివారం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం,

మిగతా..2లో

## దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ



దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.


ఇవాళ కాంగ్రెస్ మంత్రులు, నాయకులు సిగ్గు లేకుండా ఫోన్ ట్యాపింగ్ అంశం గురించి అడ్డగోలుగా మాట్లాడడం వింతగా ఉందన్నారు.

హైదరాబాద్ : దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ కాంగ్రెస్ మంత్రులు, నాయకులు సిగ్గు లేకుండా ఫోన్ ట్యాపింగ్ అంశం గురించి అడ్డగోలుగా మాట్లాడడం వింతగా ఉందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ పార్టీలో

మిగతా..2లో

## నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన
# బాధ్యత మనందరిపై ఉందని


- ప్రభుత్వ వార్షికోత్సవం సందర్భంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం
- నెల రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యేలు, ఎంపీలకు చంద్రబాబు ఆదేశం
- మనం చేసిన మంచి పనులను వివరిస్తూనే, వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై సర్వేలు చేయిస్తున్నా.. బాగోకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- తప్పులు పునరావృతం కావొద్దని, 2029 గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక ఉగ్రవాదులతో ప్రమాదమని తీవ్ర విమర్శలు



అమరావతి : ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా, నెల రోజుల పాటు ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలకు ఆయన పిలుపునిచ్చారు.

మిగతా..2లో

## అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే
# వ్యవహరించాలి



- ఎన్టీఆర్ భవన్?లో తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం
- ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా తల్లికి వందనం అమలు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు.
- మనం ఎక్కడ కూర్చోవాలో ప్రజలే నిర్ణయిస్తారని లోకేశ్ అభిప్రాయపడ్డారు.
- తొలి అడుగు- ఇంటింటికీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

అమరావతి : అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న లోకేశ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కష్టపడాలని సూచించారు. 151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా తల్లికి వందనం అమలు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తేల్చిచెప్పారు.

మిగతా..2లో

## 'హమాస్ తో డీల్ కుదుర్చుకోండి'
# ఇజ్రాయెల్ కు ట్రంప్ సూచన

- హమాస్?తో ఒప్పందం కుదుర్చుకోమని పోస్ట్ పెట్టిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- యుద్ధాన్ని ముగించి, సంధి కుదుర్చుకోవాలని అన్నారు.
- 251 మందిని బందీలుగా పట్టుకుపోయింది. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోయారు.
- ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు.



ఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్?తో ఒప్పందం కుదుర్చుకోమని ఇజ్రాయెల్?ను కోరారు. యుద్ధాన్ని ముగించి, సంధి కుదుర్చుకోవాలని అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్?ఫామ్? ట్రూత్?లో పోస్ట్ పెట్టారు. గాజాలో ఒప్పందం చేసుకోండని, బందీలను వెనక్కి తీసుకురండని పేర్కొన్నారు. అయితే ట్రంప్ ఇప్పటికే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించారు. దాన్ని ఇప్పుడు ఆమోదించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ఆయన ఒత్తిడి తెచ్చినట్లైంది. గాజాలో వచ్చేవారం సంధి కుదురుతుందని తొలుత ట్రంప్ ప్రకటించారు.

మిగతా..2లో

## సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి
# కిషన్ రెడ్డి సవాల్



ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

ఈ విమర్శలపై కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి స్పందించారు.

ఆ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు.

హైదరాబాద్, జూన్ 29: తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏ మాత్రం సహకరించడం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి కాస్తా ఘాటుగా స్పందించారు. ఆదివారం హైదరాబాద్‌లో

మిగతా..2లో

## ఈసెట్ కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం అంటూ
# ప్రభుత్వంపై విరుచుకుపడిన జగన్

-ఫలితాలొచ్చి 45 రోజులైనా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదని విమర్శ

-"అమాత్యా మేలుకో, పప్పు నిద్ర వదులు" అంటూ ఘాటు వ్యాఖ్యలు



రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, అందుకు ఏపీ ఈసెట్ అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యమే నిదర్శనమని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫలితాలు వెలువడి నెలన్నర రోజులు గడుస్తున్నా ఇంతవరకు కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ అని విమర్శించారు. ఈసెట్ ఫలితాలు గత నెల మే 15వ తేదీన వెలువడినా,ద

మిగతా..2లో

# మొదటిపేజీ తరువాయి

## అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి



దేశం మొత్తం తిరిగినా, ప్రపంచం మొత్తం తిరిగినా తిరిగి వచ్చేది మనం పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికేనని మంత్రి లోకేశ్ గుర్తుచేశారు. దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడిచేస్తే పట్టించుకోని పరిస్థితి ఆనాటి పాలనలో చూసామని ధ్వజమెత్తారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను మరువద్దని నాయుకులనీ కోరుతున్నానని అలానే పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని సీరియస్?గా తీసుకోవాలని సూచించారు. మనం ఎక్కడ కూర్చోవాలో ప్రజలే నిర్ణయిస్తారని లోకేశ్ అభిప్రాయపడ్డారు. పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. డోర్ టూ డోర్ ప్రచారం: అనుబంధ విభాగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేశ్ తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని అలానే జులై 5 నాటికి కమిటీలన్నింటినీ పూర్తిచేయాలని నేతలను ఆదేశించారు. సీనియర్లకు ఉన్న అనుభవం, యువతకు ఉన్న శక్తి రెండింటినీ జోడించాల్సిన అవసరం ఉందని అన్నారు. సీనియర్లే 4 దశాబ్దాలు పార్టీని ముందుకు తీసుకెళ్లారని అదేవిధంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కూడా ఇంటింటికీ తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. నెల రోజుల పాటు తూచా తప్పకుండా అందరం డోర్ టూ డోర్ ప్రచారం చేసి సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

## విద్యావ్యవస్థ అస్తవ్యస్తం...

## ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ: జగన్

నేటికీ అడ్మిషన్ల ప్రక్రియపై ఎలాంటి షెడ్యూల్ విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎంత దారుణంగా అస్తవ్యస్తంగా మారిందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలని ఆయన అన్నారు. రేపటి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానుండగా, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన "అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 34 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షకు హాజరుకాగా, వారిలో 31,922 మంది అర్హత సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంతమంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని జగన్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## వారిని వదిలేది లేదు..

## కేంద్రమంత్రి అమిత్ షా

నక్సల్స్ కు మద్దతుగా మాట్లాడే వారు, వారి బాధిత కుటుంబాల పరిస్థితి తెలుసుకోవాలని అన్నారు. 2026 మార్చి చివరి వరకు నక్సల్స్ ను పూర్తిగా అంతమొందిస్తామన్నారు. రాష్ట్రంలో భారీ అవినీతి జరిగిందని, తెలంగాణ మొన్నటి వరకు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం గా ఉందని, ఇప్పుడు రేవంత్ రెడ్డికి మారిందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే అవినీతి అంతం అవుతుందని కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డికి

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవాల్



విలేకర్ల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే ఏమిటో ప్రధాని మోదీని చూసి తెలుసుకోమంటూ సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మరి నువ్వు సిద్ధమా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. రాజకీయాల కోసం ఇలా మాట్లాడితే.. ఎలా అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. మీరు, మీ క్యాబినెట్ సహచరులు ఇలా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవిపై మంగళవారం క్లారిటీ వస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి.. నోటిఫికేషన్ ఈ రోజు వస్తుందన్నారు. సోమవారం నామినేషన్లు వేస్తారన్నారు. మంగళవారం నూతన అధ్యక్ష పదవిపై ప్రకటన వస్తుందని చెప్పారు. అయితే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం చేయాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించనున్న సునీల్ బన్సల్, శోభా కర్లందాజ్లే సోమవారం రాష్ట్రానికి రానున్నారని వివరించారు. వారి సమక్షంలోనే నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. నిజామాబాద్‌లో ఆదివారం పసుపు బోర్డు ప్రారంభిస్తున్నామని గుర్తు చేశారు. తాము తెలంగాణ ప్రజల కోసమే పని చేస్తామని.. అంతేకానీ సీఎం రేవంత్ రెడ్డి కోసం.. కాంగ్రెస్ పార్టీ కోసం తాము పని చేయబోమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కుండ బద్దలు కొట్టారు. మెట్రో డీపీఆర్ గత వారమే కేంద్రానికి ఇచ్చారన్నారు. మెట్రో రైలు సాధ్యాసాధ్యాలపై కేంద్రం పరిశీలన చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణలో ఈదురుగాలులతో వానలు..

## హెచ్చరించిన ఐఎండీ



మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండలో బలమైన ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

### నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన

# బాధ్యత మనందరిపై ఉందని

**మొదటి పేజి తరువాయి**



ఆదివారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పరిశీలకులతో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు.

### తప్పులు రిపీట్ చేయొద్దు!

గతంలో తాము చేసిన తప్పులు పునరావృతం కాకూడదని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది... అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. "2014లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం. కానీ, వాటిని ప్రజల్లోకి సరిగా తీసుకెళ్లలేకపోయాం, రాజకీయం మరిచిపోయాం. చాపకింద నీరులా టీడీపీపై అబద్ధాలను ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారు. వివేకానందరెడ్డి హత్యే దీనికి పెద్ద ఉదాహరణ. గుండెపోటు అని మొదట ప్రచారం చేసి, ఆ తర్వాత నాటకాలు ఆడి ప్రజల సానుభూతి పొందారు. కోడికత్తి డ్రామా, ఎన్నికల ముందు గులకరాయి డ్రామా వంటివి వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనం. ఇలాంటి దుష్ప్రచారాలను తేలిగ్గా తీసుకోవద్దు. మనం చేస్తున్న మంచిని ఎంత బలంగా వివరిస్తామో, వారి కుట్రలను కూడా అదే స్థాయిలో ప్రజలకు వివరించాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటే ఆదరిస్తారు... లేకుంటే టాటా చెప్పేస్తారు

ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండడం ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "పనిచేయడం ఒక ఎత్తయితే, జనానికి అందుబాటులో ఉండటం మరో ఎత్తు. ప్రజల్లోకి వెళ్లడానికి ఎలాంటి నామోషీ వద్దు. చేసిన పనులతో పాటు, చేయలేని పనులకు గల కారణాలను కూడా వివరించాలి. ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే, వారు అంతగా ఆదరిస్తారు. లేదంటే నిర్మొహమాటంగా టాటా చెప్పేస్తారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన పనితీరు ఉండాలి" అని సూచించారు.

ప్రతి ఒక్క ఎమ్మెల్యేతో మాట్లాడతా... మంచి చెడులు వివిస్తా

ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును తాను నిరంతరం గమనిస్తున్నానని, వివిధ మార్గాల్లో సర్వేలు చేయిస్తున్నానని చంద్రబాబు వెల్లడించారు. "ప్రతి ఎమ్మెల్యేతో త్వరలోనే నేను స్వయంగా సమావేశమవుతాను. ఇప్పటికే నలుగురితో మాట్లాడాను. వారు చెప్పేది ఓపిగ్గా వింటాను. వారిలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకోవడానికి సమయం ఇస్తాను. మారితే సంతోషం, లేదంటే నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడను. వారసులైనా సరే, కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు ఉంటుంది. పని చేయకుండా పదవులు ఆశిస్తే కుదరదు, వారికో నమస్కారం పెట్టేస్తా" అని చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు.

ప్రజలకు జవాబుదారీగా ఉందాం... పొరపాట్లు ఉంటే సరి చేసుకుందాం

పాలనలో ఏమైనా లోటుపాట్లు, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని ముందుకు సాగుదామని చంద్రబాబు అన్నారు. "ప్రజలు మెచ్చాలి, కార్యకర్తలు ఆమోదించాలి. అదే మన లక్ష్యం. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలవాలనుకోవడం బాధాకరం. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసినా 11 సీట్లకే పరిమితమయ్యారు. డబ్బు అన్నివేళలా పనిచేయదు. మనం ఆదర్శవంతమైన రాజకీయాలు చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వ కొనసాగింపుతోనే అభివృద్ధి... కళ్ల ముందున్న వాస్తవమిది

సుస్థిర ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చంద్రబాబు అన్నారు. "2004, 2019లో టీడీపీ ఓడిపోవడం వల్ల రాష్ట్రం తిరోగమనం పట్టింది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు నమ్మకంతో ముందుకొస్తున్నారు. ఏడాదిలోనే రూ.9.34 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా 8.50 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని తెలిపారు. పోలవరం, అమరావతి పనులు వేగవంతం చేశామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టిస్తున్నామని వివరించారు.

### కార్యకర్తలను మరువొద్దు

సంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ తమ ప్రభుత్వం ముందుందని చంద్రబాబు పేర్కొన్నారు. "64 లక్షల మందికి పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, డీఎస్సీ నోటిఫికేషన్, అన్నా క్యాంటీన్లు వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. విధానాలు ఎంత బాగున్నా, వాటి అమలులో లోపాలుంటే ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో బాధ్యతగా పనిచేయాలి. 2029లో గెలుపే నా ప్రణాళిక. అందుకోసం కష్టపడి పనిచేయడం కాదు, స్మార్ట్‌గా పనిచేయాలి" అని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు. రాజకీయ ముసుగు వేసుకున్న ఆర్థిక ఉగ్రవాదులు, రౌడీలతో రాష్ట్రానికి ప్రమాదమని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

## 'హమాస్ తో డీల్ కుదుర్చుకోండి'- ఇజ్రాయెల్ కు ట్రంప్ సూచన

**మొదటి పేజి తరువాయి**



అక్కడికి కొన్ని గంటల్లోనే మరోసారి సోషల్ మీడియాలో ఒప్పందం కుదుర్చుకోమని పోస్ట్ పెట్టారు. అదే సమయంలో నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయెల్ ప్రాసిక్యూటర్లను అభ్యర్థించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ పోస్టును పెట్టడం విశేషం. గత బుధవారం ట్రంప్, సోషల్ మీడియాలో స్పందిస్తూ ఇజ్రాయెల్ ప్రధానిపై కేసులు కేవలం వేధింపులు అనే అర్థం వచ్చేట్లు పోస్టు పెట్టారు. అక్టోబర్ 7వ తేదీ హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసి వందల మందిని హత్య చేసింది. 251 మందిని బందీలుగా పట్టుకుపోయింది. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోయారు. 49 మంది ఇప్పటికీ హమాస్ చెరలోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ఇరాన్‌పై యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడి మద్దతుకు నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు. అయితే ఇటీవల కాలంలో ఇజ్రాయెల్‌కు సహాయాన్ని కూడా అమెరికా గణనీయంగా పెంచింది. వాషింగ్టన్ నుంచి ప్రపంచంలో మరే దేశానికి అంత స్థాయిలో ఆర్థిక సాయం అందలేదని చెప్పాలి. అదే సయమంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. విద్వేషంతో చేసిన ఖమేనీ ప్రకటన చూసిన తర్వాత ఆ దేశంపై విధించిన ఆర్థిక ఆంక్షలు సడలించాలన్న ఆలోచనను విరమించుకున్నానని చెప్పారు. ఇరాన్ తన అణుకార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తే మళ్లీ ఆ దేశంపై బాంబులు వేయడానికి తాను వెనుకాడబోనని హెచ్చరించారు. ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్?లో ఖమేనీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టు పెట్టారు.

## దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ

**మొదటి పేజి తరువాయి**



ఉంటూ కాంగ్రెస్ పార్టీకి వంత పాడే ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఎవరు పిలవకపోయినా.. నా ఫోన్ ట్యాప్ అయ్యిందని కామెడీ చేస్తున్నాడు. ఈ ఫోన్ ట్యాపింగ్ విచారణ చేస్తారు పోలీస్ అధికారులా? గాంధీ భవన్‌లో ఉండే కాంగ్రెస్ మంత్రులు, యూత్ కాంగ్రెస్ నాయకులా? ఏది వాస్తవమో.. ఏది అవాస్తవమో.. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రెస్‌మీట్ పెట్టి ప్రజలకు తెలియజేయండి అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతూ.. హోం మంత్రిగా బాధ్యతగల పదవిలో ఉంటూ సీఎం రేవంత్ ఇస్తున్న ఆదేశాలతో వారి అనుంగు మీడియాతో తప్పుడు రాతలపై, పిచ్చి కూతలు, దొంగ లీకులతో వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారు. మహా టీవీతో పాటు మరికొన్ని వార్తా సంస్థలు, యూట్యూబ్ ఛానెల్లు అడ్డగోలుగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వారందరిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. రేవంత్ ఆదేశాలతో మా బీఆర్ఎస్వీ నాయకుడు గెల్లు శ్రీనివాస్‌పై అక్రమ కేసులు బనాయించిన పోలీసులు.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అడ్డగోలుగా, అశ్లీలంగా, జుగుప్సాకరమైన వార్తలు రాసిన మహా టీవీపై తెలంగాణ పోలీసులు సుమోటోగా కేసు పెట్టాలి. నిన్న మా బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మహా టీవీపై ఫిర్యాదు చేయడానికి వెళ్తితే.. తొలుత ఫిర్యాదు తీసుకోకపోతే, బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే అయిష్టంగా పోలీసులు ఫిర్యాదు తీసుకుంటున్నారు అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా, రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, ప్రజాసమస్యలను కాపాడాల్సిన పోలీసులు. నేడు 80-90 కేసుల నేర చరిత్రతో పాటు ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా కెమెరాల ముందు దొరికిన ఒక దొంగ మాటలు విని హేయమైన పాత్ర పోషిస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా సొంత ప్రభుత్వ మంత్రులైన పొంగులేటి, కొండా సురేఖలతో పాటు ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాపింగ్ చేస్తుండడం నిజం కాదా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

## బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై

# అత్యాచారం, ఐదుగురి అరెస్ట్



బంగ్లాదేశ్‌లో తీవ్ర కలకలం రేపిన అత్యాచార ఘటనలో పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. హిందూ వర్గానికి చెందిన ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, ఆ దారుణాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేసిన ఆరోపణలపైవీరిని అదుపులోకి తీసుకున్నారు. కొమిల్లా జిల్లాలోని మురాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌చంద్రాపూర్ పంచకిట్ట గ్రామంలో గురువారం ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది.

గ్రామస్థులు పట్టుకున్నా తప్పించుకున్న నిందితుడు

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, బాధితురాలు ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన 36 ఏళ్ల అలీ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అఘాయిత్యాన్ని గమనించిన స్థానిక గ్రామస్థులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అయితే, అతను వారి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న కొందరు బాధితురాలిని అసహాయ స్థితిలో వీడియో తీసి, దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. బాధితురాలు తన పరువు కాపాడాలంటూ వేడుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉండటం తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ ఘటనపై మురాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, ప్రధాన నిందితుడు అలీతో పాటు, వీడియోను రికార్డ్ చేసి వ్యాప్తి చేసిన మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు ధృవీకరించారు. నిందితులందరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

### మైనారిటీల భద్రతపై ఆందోళన

ఈ ఘటన బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, మహిళలపై జరుగుతున్న హింసపై మరోసారి ఆందోళనలను రేకెత్తించింది. మైనారిటీ వర్గాలపై దాడులను ఖండిస్తూ మే 31న ఢాకాలోని జాతీయ ప్రెస్ క్లబ్ ఎదుట 'సమ్మిలిత సనాతన్ పరిషద్' అనే మైనారిటీ కూటమి ఆధ్వర్యంలో మానవహారం, నిరసన ర్యాలీ నిర్వహించారు. మత ప్రాతిపదికన మహిళల హక్కులను కాలరాసే ప్రయత్నాలను నిరసిస్తూ మే 16న వేలాది మంది మహిళా హక్కుల కార్యకర్తలు పార్లమెంట్ సమీపంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఇటీవల దుర్గామాత ఆలయంపై జరిగిన దాడి నేపథ్యంలో, బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీల భద్రతను అమలుపరచాల్సిన బాధ్యత ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వంపై ఉందని జూన్ 27న భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. తాజా ఘటనతో మైనారిటీల భద్రత అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# రజక సభ్యుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

## - రజక సంఘం

-మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి, వృత్తి ధరల పెంపుదలకు తీర్మానం

-విరాళాలిచ్చిన దాతలకు సంఘం కృతజ్ఞతలు



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి, జూన్ 29 :** హుజురాబాద్ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మారుతి నగర్‌లోని సంఘం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజక వృత్తికి గల ధరలను పెంచడంపై, అలాగే మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తీర్మానాలు స్వీకరించారు. సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి విరాళాలు స్వీకరించారు.ఈ సందర్భంగా పలువురు దాతలు తమ వంతు సహకారాన్ని అందించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొలిపాక శ్రీనివాస్ రూ.50,000, మాజీ కౌన్సిలర్ నల్ల సుమన్ రూ.20,116, కొండపాక శ్రీనివాస్ రూ.15,000 విరాళంగా ఇచ్చారు. అలాగే సభ్యులు నల్ల బాలరాజ్, కొల్లిపాక శంకర్, కొలిపాక సారయ్య, నల్ల సదయ్య తతదితరులు రూ.10,000 చొప్పున విరాళాలు అందజేశారు ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, పెరుగుతున్న దినసరి ఖర్చులకు అనుగుణంగా వృత్తి ధరలు పెంచడం ద్వారా రజక కుటుంబాలకు ఆర్థికంగా బలపడే అవకాశం ఉందన్నారు. సంఘ సభ్యుల సమస్యలను సంఘటితంగా పరిష్కరించుకుంటామని, ప్రతి ఒక్కరికి సంఘం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు కొలిపాక సారయ్య, కొండపాక శ్రీనివాస్, నల్ల బాలరాజు, గోపు వెంకటేశ్వర్లు, కొలిపాక శ్రీనివాస్, కొలిపాక శంకరయ్య పాల్గొన్నారు. మహిళా విభాగం నుంచి కొండపాక లక్ష్మి, లలిత, నిమ్మటూరి రమ కొలిపాక రాజేశ్వరి, గోపు శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి సంఘ సభ్యులు, కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ద

# రామన్నపేట నియోజకవర్గం కోసం పోరాటం సాగిద్దాం

లిపు పట్టణంలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్ లో సమావేశం

తెలంగాణ మలిదశ ఉద్యమకారులు రెబ్బసు రాములు



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్,జూన్ 29** : కేంద్ర ప్రభుత్వం డిలిమిటేషన్ కమిటీ 2026 లో తిరిగి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతున్న సందర్భంగా , రామన్నపేట నియోజవర్గం గా ప్రకటించే వరకు పోరాటం సాగిద్దాం రండి అంటూ తెలంగాణ మలి దశ ఉద్యమ కారుడు రెబ్బసు రాములు పిలుపునిచ్చారు. 2008లో డి లిమిటేషన్ కమిటీ రద్దు చేయడం జరిగిందని ,2026 తిరిగి నియోజకవర్గ పునర్విభజన జరుగుతున్న సందర్భంగా అందరం ఐక్యంగా కలిసికట్టుగా పోరాడుదాం అని తెలిపారు. రేపు మంగళవారం రామన్నపేట పట్టణంలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఫంక్షన్ హాల్ ఉపలమగుడిలో జరిగే సమావేశానికి వివిధ పార్టీల అధ్యక్షులు కార్యదర్శులు ప్రజా సంఘాలు నాయకులు, వివిధ వృత్తి సంఘాలు నాయకులు, మండలంలోని మహిళా సంఘాలు నాయకురాలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు ,మాజీ సర్పంచులు, కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు అందరూ సమావేశంలో పాల్గొని చర్చించి ముందుకు పోవడానికి ఎజెండా రూపొందించు కోందామని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల మండల కమిటీ ఆధ్వర్యంలో కోరారు.

# పథకాలు ఇప్పిస్తామని డబ్బులు అడిగితే క్రిమినల్ కేసులు

ఇందిరమ్మ ఇండ్ల పేర

రూ 20, వేలు వసూలు చేసిన అందే నరేష్ పై కేసు నమోదు

పట్టణంలో 18 వ వార్డులో లబ్ధిదారుల వద్ద నుంచి వార్డ్ ఆఫీసర్ పేరు తో దందా

కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ , జూన్ 29 :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పిస్తామని , లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లయితే క్రిమినల్ కేసు పెట్టడం జరుగుతుందని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. భువనగిరి పట్టణంలోని 18 వార్డు లో వార్డు ఆఫీసర్ పేరు చెప్పి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులకు గాను అందే నరేష్ ,రూ.20 వేలు వసూలు చేయడం జరిగిందని , అభియోగం వచ్చినందున అతనిపై చట్టపరమైన క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాట నమ్మవద్దని అలా ఎవరైనా వస్తే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు . అట్టి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని దళారులను నమ్మొద్దని ఇందిరమ్మ ఇండ్లు కట్టు కునేందుకు ప్రభుత్వం, రూ .5 లక్షలు సహాయం అందిస్తుందని, ఎవరైన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని చెప్పిన వారి మాటలు నమ్మి మోస పోవద్దన్నారు .

# ఘనంగా ఊరు(బోనాల) పండుగ





**ముధోల్/జూన్ 29/ తెలంగాణ సేన న్యూస్** : ముధోల్ నియోజకవర్గ కేంద్రంలో ఊరు పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సంరక్షణలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి విగ్రహాలను భాజభజంత్రీలతో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు మహాలక్ష్మి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వివిధ కుల సంఘాల గ్రామస్తులు, చిన్న పెద్ద తేడా లేకుండా ఊరేగింపుగా బయలుదేరి మహాలక్ష్మి అమ్మవారికి, గ్రామంలోని దేవతలకు బోనాలను సమర్పించారు. దొంతులను తలపై ఎత్తుకొని ఊరేగింపుగా, మహిళలు భజన పాటలను పాడుతూ ఉత్సాహంగా బోనాల పండుగను జరుపుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ...ఊరు పండుగ అనగా పెద్ద పండుగ ఉత్సవం, ఊరేగింపు కార్యక్రమాల్లో ఎప్పటికప్పుడు మరిన్ని సంఘాలను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తూ వస్తున్నాం. దీంతో ప్రజల్లో ఐకమత్యం పెరుగు తోందని అన్నారు. మరోవైపు రాజకీయాలకతీతంగా గ్రామంలో ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొన్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా పండాలని కోరారు.

# కామ్రేడ్ పాండరి ఉన్నత ఆశయాలు సజీవంగా ఉంటాయి

మల్లాపురం సంతాప సభ లో ఘనంగా నివాళులు

సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్,బేజాడి కుమార్



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ జూన్ 29. :** నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్య సాధనకు, దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథా ఉన్నత ఆశయం ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి అని , కామ్రేడ్ కర్రె పాండరి కి, సిపిఐ( ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి, అఖిల భారత రైతు కూలీ సంఘం .జిల్లా కార్యదర్శి ఆర్ జనార్ధన్, బేజాడి కుమారులు కొనియాడారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో కామ్రేడ్ కర్రె పాండరి సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి విప్లవ జోహార్లు అర్పించారు.సిపిఐ (ఎంఎల్ )న్యూ డెమోక్రసీ గ్రామ కమిటీ కార్యదర్శి మోటే అంజయ్య అధ్యక్షతన జరిగిన సంతాప సభ సందర్భంగా మాట్లాడుతూ, 1978 నుంచి సుమారు నలభై యేళ్ళుగా దున్నే వారికే భూమి రణ నినాదాన్ని భుజాన వేసుకొని, వీరోచితంగా సాగిన భూస్వామ్య వ్యతిరేక పోరులో క్రియాశీలక పాత్రను పోషించిన పాండన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా ,ఎంచుకున్న ప్రజా విముక్తి మార్గం,దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం, చేసిన పోరాటాలు ప్రజల గుండెల్లో కొలువై ఉంటాయి అని శ్లాఘించారు. జనార్ధన్, కుమార్ లు మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల సమస్యలను,దేశాభివృద్ధిని మరిచి, పిడికెడు మంది గా ఉన్న బడా కార్పోరేట్ సంస్థలకు దేశ సంపదను కొల్ల గొట్టుక పోవడానికి గేట్లు ఎత్తివేసి ,దేశానికి,ప్రజలకు తీవ్ర ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ఉగ్రవాదులు, పాకిస్తాన్ తో చర్చలు జరుపు తాము తప్ప,మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తి లేదని చెపుతున్న మోడీ సర్కార్ తీరు పై ధ్వజమెత్తారు. కోట్లాది రూపాయల విలువైన అటవీ సంపదను అంబానీ, అదానీల కు దోచి పెట్టడానికి ఎంత ఉబలాట పడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు .స్వదేశీ నినాదం పేరుతో అధికారంలోకి వచ్చి,విదేశీ విధానాన్ని అమలు చేస్తూ,ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కటొక్కటిగా ప్రైవేట్ పరం చేస్తూ,శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నింపుతూ,కార్మిక,ఉద్యోగ హక్కులను కాల రాయడానికి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధానమైన హామీలను అమలు చేయకుండా, కాలయాపన చేస్తుందని దుయ్యబట్టారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను,బ్యాంక్ రుణాలను అందివ్వడంలో వెనక బడిపోయిందని విమర్శించారు. ముందుగా మురిపించి నేటివరకు చినుకు కూడా పడకపోవడంతో విత్తిన పత్తి మొక్కలు నిట్టనిలువునా మాడి పోతున్నాయని, పత్తి విత్తనాలను వేల రూపాయలు ఖర్చుచేసి రైతులు లబోదిబో మంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాడిపోయిన మొక్కల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కామ్రేడ్ కర్రె పాండన్న జీవిత భాగస్వామి లక్ష్మి,కుమారులు జహంగీర్,మధు, కూతుళ్లు , ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య,ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా నాయకులు బర్మ బాబు, తమ్మడి అంజయ్య,చిర బోయిన కొమురయ్య,ఆర్. ఉదయ్,కొంగర సాయిరాం, యెలగందుల సిద్దులు, వంగాల మధు సూదన్ రెడ్డి, గడ్డం యాదగిరి,కళ్లెం బాల్ నర్సయ్య, సుంచు రాములు,సత్తయ్య, సాయిలు, నారాయణ శ్రీను తదితరులు పాల్గొన్నారు..

# మాలల పై హత్య యత్నానికి పాల్పడ్డ నిందితుల ను వెంటనే అరెస్ట్ చేయాలి

మాల మహానాడు చౌటుప్పల్ డివిజన్ కమిటీ డిమాండ్

కప్రాయపల్లి లో కత్తులతో పొడిచి తీవ్రంగా గాయపరిచిన సుంకరి రవిని పరామర్శించారు

దాడి చేసిన వారిపై తక్షణం చట్టపరమైన చర్యలు చేపట్టకపోతే

దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలో ఉధృతం చేస్తాం



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,జూన్ 29 :** మాలల పై దాడి చేసి అత్యా యత్నాని కి పాల్పడిన అగ్ర కుల దుండగులను వెంటనే అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచాలని, చౌటుప్పల్ మాల మహానాడు డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం జిల్లాలోని భూదాన్ పోచంపల్లి మండలం కప్రాయపల్లి లో అగ్రకుల దాడిలో తీవ్రంగా గాయపడి న సుంకరి రవి, ఇతరులను పరామర్శించారు. సంఘటనకు గల కారణాల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు జువ్వి నరసింహ మాట్లాడుతూ కప్రాయపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై అధికారులకు ఫిర్యాదు చేసిన సుంకరి రవి పై కక్ష పెంచుకున్న అగ్రవర్ణ కులస్తులు కత్తులతో పొడిచి తీవ్రంగా గాయ పరచడం హత్యాయత్నానికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. దాడి చేసి 15 రోజులు గడుస్తున్నా నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. పోలీసులు నిందితులకు సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయని విమర్శించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోచంపల్లి పోలీస్ స్టేషన్ లో అధికారులను కలిసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సంగం నర్సింగ్ రావు, జువ్వి రఘుపతి, దొడ్డి రాములు, కట్ట శంకర్, ఎన్నమల్ల నాగరాజు, జువ్వి శివ, పెరుమళ్ళ రవి, సుంకరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# స్వాంతన చారిటెబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**బాగ్ అంబర్ పేట్, జూన్ 29 :** ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని స్వాంతన చారిటెబుల్ ట్రస్ట్ ప్రతినిధి వీ.కే.శబరి అన్నారు. స్వాంతన చారిటెబుల్ ట్రస్ట్, గద్దె రామోజీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాగ్ అంబర్ పేట్ డివిజన్ లోని బతుకమ్మ కుంట చెంచు సంక్షేమ సంఘం హాలులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి నుండి వచ్చిన జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, గైనకాలజి వైద్యులు 200 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి, ఆరోగ్య సలహాలను, మందులు కూడా అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ శిబిరంలో భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శివరామకృష్ణ, వి హెచ్ పి నాయకులు రవికుమార్, శేఖర్, బీజేపీ నాయకులు నాగరాజు చారి, బాలు, రవీందర్, జర్నలిస్ట్ ఎం. రమేష్, క్యాంప్ కో ఆర్డినేటర్లు నర్సింగ్ రావు, విక్రమ్, లావణ్య పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాముకుంట జెడ్ పి హెచ్ ఎస్ లో 2008 -2009 విద్యా సంవత్సరం



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,జూన్ 29 :** రాజాపేట మండలం పాముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలలో 2008- 2009 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులంతా తాము చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకొని తమ పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఈ సందర్భంగా ప్రస్తుతం తాము చేస్తున్న వృత్తులను కుటుంబ స్థితిగతులను ఒకరికి ఒకరు పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా విద్యాభివృద్ధులు నేర్పిన గురువులు. సత్యనారాయణ, రమేష్ సైమల, శశిరేఖ, శ్రీనివాస్,జానయ్య పెంట రమేష్, కేశవులు పుష్పలత,ప్రకాశం,ఘన స్వాగతం పలికి వేదికపై శాలువా,పూలమాలలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా విద్యార్థులంతా సహపంక్తి భోజనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. చదువుకున్న సమయంలో తీపి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకొని ఆనందంగా గడిపారు.

# జూలై 9 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

మోడీ కార్పొరేట్ విధానాల ను వ్యతిరేకంగా

నాలుగు కోడ్ విధించి కార్మికులను మోసం

యాజమాన్యాలకు కార్మికులను బానిసలుగా చేస్తూ

సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు



భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ ,జూన్ 29. : జూలై 9 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, సిఐటియు జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న మున్సిపల్ కాంటాక్ట్ కార్మికుల జనరల్ బాడీ రామచంద్ర అధ్యక్షతన నిర్వహించారు. సందర్భంగా దాసరి మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మార్చాలని ప్రయత్నం చేస్తున్నారు అని ఆరోపించారు.దేశంలో బడా పెట్టుబడి దారులకు అంబానీ ఆదాని లాంటి వారికి కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టాలు తీసుకురావాలని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు.నాలుగు కోడ్ విధించి కార్మికులను మోసం చేస్తున్నారు అని అన్నారు. దాన్ని కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా చేస్తున్నదని ఈ విధానాలను ప్రతిఘటించడానికి జూలై 9 న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశవ్యాప్త స్వారధిక సమ్మెలో పాల్గొని మన హక్కులు కాపాడుకోవాలని, కార్మిక వర్గం పాల్గొని మోడీ కార్పొరేట్ విధానాల వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మాయ కృష్ణ మున్సిపల్ యూనియన్ నాయకులు ఊదరి రామచందర్, ఆడేపు వెంకటేష్ ,రవి, విజయ్, గద్దె యాదగిరి, కుమార్, రాజలింగం ,రాజయ్య ,బిక్షపతి, శాంతమ్మ, లక్ష్మీనరసింహ, పొట్ట సునీత , వరమ్మ , సుజాత తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ శంకరయ్య కు ఘన నివాళులర్పించిన శిష్యులు..



**.తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి జూన్ 29 :** కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గత వారం రోజుల క్రితం మరణించగా ఆదివారం తన ప్రియ శిష్యులు ఘన నివాళులు అర్పించి,తన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ కొండపాక శంకరయ్య నాటి ఎలుకతుర్తి మండలం గోపాలపురం గ్రామంలో ఉద్యోగరీత్యా సుమారు 12 సంవత్సరాల పాటు పని చేసి ఆ పాఠశాలలో విద్యనభ్యసించిన నిరుపేద బిడ్డలను కుల, మతాలకతీతంగా గొప్పగా ఎదగాలని,ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయి ఎదిగే విధంగా శిక్షణ ఇస్తూ ఎందరో జీవితాలలో వెలుగులు నింపి మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఆయన వ్యాయామ ఉపాధ్యాయుడే కాకుండా ప్రధానోపాధ్యాయులుగా వివిధ ప్రాంతాలలో విశేషమైన సేవలను అందించి ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులను క్రీడారంగంలో జాతీయ అంతర్జాతీయ పోటీలలో విజేతలుగా నిలిపిన ఘనత ఆయనదని పేర్కొన్నారు, చదువుతో పాటు, క్రమ శిక్షణ తో కూడిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారందరూ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వై సరస్వతి, కే. తిరుమల, ఎస్ శ్యామ్ సుందర్, కే. శ్రీనివాస్, కే. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ రొటేరియన్ మద్ది దివాకరరెడ్డి జన్మదిన వేడుకలు





**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ ,జూన్ 29.** సీనియర్ రొటేరియన్, డాక్టర్ పద్మజ సంతాల సాఫల్య కేంద్రం అధినేత మద్ది దివాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం భువనగిరి పట్టణంలో రోటరీ క్లబ్, భువనగిరి రోటరీ క్లబ్ భువనగిరి సెంటర్ అధ్యక్షులు కరిపే నర్సింగరావు ,ఎండి మేమన్ లు శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా గడ్డం జ్ఞాన ప్రకాశ్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఫకీర్ కొండల్ రెడ్డి, కార్యదర్శి కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి, ఎన్నికల కార్యదర్శి సిద్ధిరాములు, కోశాధికారి గుమ్మల మల్లేశం, క్లబ్ డైరెక్టర్ లు రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి అండ్ సెంట్రల్ రేకల శ్రీనివాస్, బద్దం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం హబ్సిగూడ హైదరాబాద్, భువనగిరి అధినేత అందరికీ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్మల్‌లో అంగన్వాడీల సమరశంఖం

**జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు!**

**లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం కోసం పోరాటం**



**నిర్మల్ /జూన్ 29/తెలంగాణ సేన న్యూస్.:** కార్మికుల హక్కులను కాపాడాలని, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాడాలని అంగన్వాడీ టీచర్స్ %డ% హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఐసిడిఎస్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని నిర్మల్ సెక్టర్ కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బొమ్మెన సురేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని అనేక పోరాటాలు నిర్వహించామని గుర్తు చేశారు. 2013లో జరిగిన 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐసిడిఎస్ ప్రైవేటీకరణ చేయకూడదని స్పష్టంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. అంతేకాదు, అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చట్టం 1972ను వర్తింపజేయాలని 2022లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, అలాగే 2024లో గుజరాత్ హైకోర్టు అంగన్వాడీ టీచర్లను మూడవ తరగతి, హెల్పర్స్‌ను నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తీర్పు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్పులను అమలు చేయాలని, అందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పెంచాలని అంగన్వాడీలు నిరంతరం పోరాడుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి శైలజ మాట్లాడుతూ, ఐసిడిఎస్‌ను సంస్థాగతం చేయాలని సుప్రీంకోర్టు, కాగ్ నివేదిక, యునిసెఫ్ వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పాటు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ కూడా నిర్ణయించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఈ పథకం యొక్క ప్రాధాన్యతను గుర్తించకపోగా, దీనిని పూర్తిగా వదిలించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రైవేటీకరణలో భాగంగా ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తూ %చీజూ% (జాతీయ విద్యా విధానం) చట్టాన్ని తీసుకువచ్చిందని, పీఎం శ్రీ, మొబైల్ సెంటర్స్ వంటి విధానాలను ముందుకు తెస్తోందని విమర్శించారు. ఐసిడిఎస్ నిర్వహణ ఖర్చులో కేవలం 60% మాత్రమే రాష్ట్రాలకు చెల్లిస్తోందని, అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ పెంచడం లేదని ఆమె అన్నారు. ఈ చర్యలు ఐసిడిఎస్ నిర్వీర్యానికి దారితీస్తున్నాయని హెచ్చరించారు. దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, గౌరవప్రదమైన వేతనాలు లేకపోవడం, రక్తహీనత, పోషకాహార లోపం తీవ్రమవుతున్న దశలో ఐసిడిఎస్ సేవలు మరింత అవసరమని ఈ అంశాలు తెలియజేస్తున్నాయని శైలజ స్పష్టం చేశారు. ఐసిడిఎస్‌కు నష్టం కలిగించే చర్యలను తక్షణమే ఆపివేయాలని, ఐసిడిఎస్‌కు నిధులు పెంచి బలోపేతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటి పరిష్కారం కోసం 2025 జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అందరూ భాగస్వాములు కావాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు లావణ్య, రమ్య, భాగ్య, హేమలత, ఉమా, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ముధోల్ కు ఎమ్మెల్యే రాక

**మండల అధ్యక్షులు కోరి పోతన్న**



**ముధోల్: జూన్ 29 (తెలంగాణ సేన న్యూస్) :** మండల కేంద్రమైన ముధోల్ కు ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం రానున్నట్లు మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కోరి పోతన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వం మంజూరు చేసి న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబా రక్ చెక్కుల పంపిణీ కార్యక్ర మానికి ఎమ్మెల్యే రామారావు పటేల్ ముఖ్యఅతిథిగా హాజ రు కానున్నారు. దీంతో ఎమ్మె ల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు కా ర్యకర్తలు, పదాధికారులు సకా లంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## నిర్మల్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో డీఈఓ రామారావు ఆటవిడుపు

**నిర్మల్/జూన్ 29/తెలంగాణ సేన న్యూస్.:** నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు ఆదివారం రోజు నిర్మల్‌లోని కురన్నపేటలో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ రామారావు విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. పాఠశాలలో తరగతులు ఎలా జరుగుతున్నాయి, చదువు ఎలా ఉందనే విషయాలపై విద్యార్థుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఆటవిడుపు కావడంతో విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆట ఆడారు. అదేవిధంగా, విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని, పోషక విలువలతో కూడిన భోజనం చేయాలని, అందరూ కలిసిమెలిసి ఆటలు ఆడాలని వారికి సూచించారు. అంతేకాకుండా, పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారికి హితవు పలికారు.ఈ కార్యక్రమంలో డ్యూటీ టీచర్ రవి, వంట సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయులు రామదాసు పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట తెలంగాణ సేన :** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని గ్రీన్ రిసార్ట్ లో వ్యాయామ ఉపాధ్యాయులు చెన్నబోయిన రామదాసు పదవి విరమణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొని రామదాసు - రమాజ్యోతి లను శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా నాయకులు తాళ్ళపెల్లి చంద్రమౌళి గౌడ్, మేరుగు లక్ష్మణ్ బాబు, కూచన శ్రీనివాస్, దూలం రాజేందర్, డ్యాగల శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డ మోహన్ రావు దశదినకర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నర్సంపేట తెలంగాణ సేన :** దాత ,ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ దొడ్డమోహన్ రావు దశదిన కర్మ హైదరాబాద్ లోని %జీ=జ% ఫంక్షన్ హాల్ ఫిలింనగర్ నందు జరగగా వారి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి దంపతులు..

## ఆర్ ఎన్ ఐ లేని పత్రికలపై వేటు

**టిఇఎల్ నెంబర్ లేకుండా పత్రిక లో ఊహాజనిత వార్తలు రాస్తే చర్యలు తీసుకోండి...**

**పి ఆర్ జి ఐ కఠిన ఆదేశాలు**

**రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కు ఆదేశాలు ..**

**త్వరలో జిల్లా డి పి ఆర్ ఓ లకు ఉత్తర్వులు**




**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ ,జూన్ 29.** : ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం పై అ సత్య వార్తలు ప్రచురిస్తూ, దేశంలోని ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛ హరించే విధంగా కొన్ని ఆర్ ఎన్ ఐ లేని పత్రిక లు సత్య దూరం లేని వార్తలు ప్రచురించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో అసంఖ్యాధికంగా పి డి ఎఫ్ పత్రికలు సోషల్ మీడియా ద్వారా ఫేక్ వార్తలు సృష్టిస్తు న్నాయని ,వీటిపై చర్యలు తీసుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణ జిల్లా సీనియర్ పాత్రికేయులు ఎస్ నరహరి నాగేశ్వర ప్రసాద్,పి ఆర్ జి ఐ. న్యూ ఢిల్లీ అప్పీలు చేయగా, ప్రెస్ రిజిస్టర్ జనరల్ ఆఫ్ ఇండియా సదరు పిర్యాదు పై లోతుగా అధ్యయనం చేసి ఆర్ ఎన్ ఐ లేని పత్రికలపై వేటు కు రంగం సిద్ధం చేసింది . కఠిన ఆదేశాలు జరీచేస్తూ ,ఇక ముందు ఆర్ ఎన్ ఐ లేని పత్రికల వార్తలను ప్రామాణికంగా తీసుకోవద్దని తప్పుడు వార్తలు ప్రచురిస్తే చట్ట పరమైన చర్యలకు వెనుకాడ బోవద్దని, అలాగే పత్రిక భాషలో వాడాల్సిన పదాలు పూర్తి స్థాయిలో పొందుపరిచి ఉత్తర్వులు జారీచేసింది. దీని గమనించి రాష్ట్ర జిల్లా పౌరసంబంధాల అధికారులు పరిగణించాలని ఆర్ ఎన్ ఐ లేని పత్రికల పూర్తి సమాచారాన్ని సదరు జిల్లా పౌరసంబంధాల అధికారులు సేకరించి రాష్ట్ర కార్యాలయాలకు పంపాలని ఆదేశాలు జరీ చేశారు.

## కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి....

**- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**- తిప్పాపూర్ గోశాలలో 137 జతల కోడెల పంపిణీ**



తెలంగాణ సేన,వేములవాడ,జూన్ 29 : కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి, అర్హులైన రైతులకు 137 జతల కోడెలను 274 జీవాలను అధికారులు రైతులకు ఆదివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో ఈఓ రాధాభాయి,జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధా కృష్ణ రెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు,తదితరులు పాల్గొన్నారు..

## ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వారసుడు ఏర్పుల సాయి కుమార్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.



తెలంగాణసేన: జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వారసుడు ఏర్పుల సాయి కుమార్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని, బుద్ధుడు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాన్షీరామ్ మహనీయుల ఆశయాల కోసం నిరంతరం పనిచేయాలని వాళ్ళ ఆశయాల కోసం కృషి చేయాలని, జీవితంలో మరెన్నో ఉన్నత స్థాయిలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చెపిస్తే క్రిమినల్ కేసులు తప్పవు....

**- ఎస్పీ మహేష్ బి. గితే**





**రాజన్న సిరిసిల్ల, జూన్ 29,(తెలంగాణ సేన ప్రతినిధి - అనీఫ్) : :** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం జులై 01 నుండి 31తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఎస్పీ ఎస్పీమహేష్ బి. గితే అధికారులకు ఆదేశించారు.ఆపరేషన్ ముస్కాన్-11కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ శాఖల అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీమహేష్ బి. గితే మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ -11లో పాలుపంచుకొంటున్న ప్రతి ఒక్క అధికారి సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా విధులు నిర్వహించాలన్నారు.ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని దానిని అనుభవించటం ప్రతీ పౌరుని హక్కు అని,క్షణికావేషంలో పిల్లలు తొందరపాటులో చిన్న చిన్న విషయాలకే తల్లి దండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారని,ఇట్టి అవకాశాన్ని ఆసరాగా తీసుకొని కొందరు వారిని ప్రమాదకర పనుల్లో వారితో పనులు చేయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారని అలాంటి వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు.సిరిసిల్ల, వేములవాడ డివిజన్ స్థాయిలో ఒక ఎస్ఐ మహిళా పోలీస్ అధికారి, నలుగురు సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో ఏర్పాటు చేసిన రెండు టీమ్స్ జిల్లాలో పిల్లలతో పనిచేసే అవకాశాలు ఉన్న పలు పరిశ్రమలు,హోటల్స్,వ్యాపార సముదాయాలు, గోదాములు,మెకానిక్ షాపులు,హోటల్స్, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మక తనిఖీలు నిర్వహించాలని అన్నారు.స్కూల్స్ కు వెళ్లకుండా వివిధ కారణాల వల్ల డ్రాపౌట్ అయిన పిల్లల తల్లి దండ్రులకు నచ్చ చెప్పి తిరిగి వారిని పాఠశాలకు పంపే ఏర్పాటు చేసి వారికి కొత్త జీవితాన్ని ఇవ్వాలన్నారు.ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే పోలీస్ వారికి సమాచారం తెలపాలని విజ్ఞప్తి చేశారు.18సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయుస్తున్న వారిపై 2024 సంవత్సరంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ లో 21 మందిపై క్రిమినల్ కేసులు,ఈ సంవత్సరం జనవరిలో నిర్వహించిన అపరేషన్ స్మైల్ కార్యక్రమంలో 08 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు.ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు,డిడబ్ల్యూవో లక్ష్మీరాజాం, డిఆర్ డి వో శేషాద్రి, సిఐ లు నటేష్, నాగేశ్వరరావు, అసిస్టెంట్ లేబర్ అధికారి నజీర్ హమ్మద్, డాక్టర్ నయుమ్ జహా, విద్య శాఖ కోర్దినేటర్ సతీష్ కుమార్, షీ టీమ్? ఏ ఎఎస్ఐ ప్రమీల,పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్ పై అసత్య ప్రచారం.. మహా టీవీపై కేసు నమోదు చేయాలి....

**- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్**




తెలంగాణ సేన,రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 29 :: ఫేక్ న్యూస్ మహా టీవీ యాజమాన్యం పై కేసు నమోదు చేయాలి, మీడియా ముసుగులో అరాచకాలను సహించేది లేదు. గెల్లు శ్రీనివాస్ అరెస్టును ఖండిస్తున్నామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, కేటీఆర్ పైన ఫేక్ న్యూస్ లు ప్రచారం చేస్తున్న మహా టీవీ ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఒక మహా నాయకుడు అతనిపై ఇష్టం వచ్చినట్టు ప్రచారం చేస్తున్న మహా టీవీ యజమాన్యం ఖబర్దార్ మరోసారి మా కేటీఆర్ పై ఇష్టం వచ్చినట్టు ప్రచారం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలియజేస్తున్నామని అన్నారు. తెలంగాణ తీసుకొచ్చిన గొప్ప నాయకుని కుటుంబంపై ఇంత కక్ష సాధింపుల కావాలనే పొద్దున లేవగానే కేటీఆర్ పైన మహా టీవీలో ఇష్టం వచ్చిన ఫేక్ న్యూస్ లు ప్రచారం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. మీడియా ముసుగు లో అరాచకం చేస్తున్న మహా టీవీ యజమాన్యం కేటీఆర్ పైన అసత్య ప్రచారం బిఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.కేటీఆర్ పైన ఫేక్ న్యూస్ లు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న మహా టీవీ యజమాన్యం తెలంగాణ ప్రజలు మేధావులని అన్ని గ్రహిస్తున్నారని తెలియజేస్తున్నామని అన్నారు. అలాగే తెలంగాణ భవన్ దగ్గర విద్యార్థినేత బిఆర్ఎస్వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.మీరు ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదు తెలంగాణ ఉద్యమ పార్టీగా బిఆర్ఎస్ కార్యకర్తలు అట్టి అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని తెలియజేస్తున్నామని అన్నారు. కేటీఆర్ పైన ఫేక్ న్యూస్ లు ప్రచారం చేస్తున్న మహా టీవీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వడ్లూరి సాయికిరణ్, ముద్దం అనిల్ గౌడ్, పోడం వెంకటేశం, నక్క జోహెల్, అక్రమ్, వజ్రల్, ఖతర్ తదితరులు పాల్గొన్నారు.

## కుల, మత ఆధిపత్య భావజాలాన్ని అడ్డుకోవాలి

**: ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు గుండు నరసింహ**



**తెలంగాణసేన :** దేశంలో కుల, మత ఆధిపత్య భావజాల వ్యాప్తి జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రజాతంత్ర, లౌకిక వాదులపై ఉందని ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు గుండు నరసింహ అన్నారు. ఆదివారం నారాయణపురం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ప్రజానాట్యమండలి 2వ మండల మహాసభ సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ మతోన్మాద శక్తులు సాంస్కృతిక రంగాన్ని తమ గుప్పెట్లోకి తీసుకునే ప్రయత్నాలను తీవ్రం చేశాయన్నారు. నూతన ఆర్థిక విధానాల కారణంగా వస్తున్న ప్రజా సమస్యలపై పోరాడే ప్రజాకళలను వ్యాప్తి చెందకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతున్నదన్నారు. దానిలో భాగంగానే అభ్యుదయ సాహిత్యానికి, కళాకారులకు నిలయంగా ఉన్న కళా సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్రకు బీజేపీ పూనుకున్నదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజానాట్యమండలి కర్తవ్యం మరింత పెరిగిందనీ, మహా సభ కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు, ప్రజాకళారూపాలను రూపొందించి ప్రజల్లోకి తీసుకువెళ్లాడానికి కృషి మరింత జరగాలని ఆకాంక్షించారు. కళాకారుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు సమకాలీన రాజకీయ అంశాలపై నూతన రచనలు తీసుకువచ్చి విశాల, ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమానికి అడుగులు పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు గుంటోజి సుదర్శన్ చారి, మండల అధ్యక్షులు బోయిని మల్లేష్, సీనియర్ నాయకులు గాజుల అంజయ్య, లాలయ్య, గాలయ్య, తదితరులు పాల్గొన్నారు

## బీజేపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పనిచేయాలి



**తెలంగాణ సేన,రాజన్న సిరిసిల్ల జిల్లా,జూన్ 29 ::** శివనగర్‌లోని శివాలయంలో భారతీయ జనతా పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ మాజీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన పట్టణ కమిటీకి, అలాగే పూర్వ పట్టణ కమిటీకి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, సీనియర్ నాయకులు గరిపెల్లి ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను, పూర్వ కమిటీ సభ్యులను సన్మానించారు.ఈ సందర్భంగా నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ పాత, కొత్త కమిటీలు కలిసికట్టుగా పనిచేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో అడపు రవీందర్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగిరిందని గుర్తు చేశారు. ఆ ఐదేళ్ల కాలంలో సిరిసిల్లలో అభివృద్ధి ఎలా ఉండాలో అప్పటి మున్సిపల్ చైర్మన్ అడపు రవీందర్ చేసి చూపించారని కొనియాడారు. సిరిసిల్లలో ఎక్కడికి వెళ్ళినా ఆయన చేసిన పనులు ప్రతి ఒక్కరికీ గుర్తుకొస్తాయని అన్నారు. ఆడెపు రవీందర్ హయాంలో పాత బస్టాండ్‌లో బస్టాండ్ నిర్మాణం, బస్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్, కార్గిల్ లేక్ సెంట్రల్ లైటింగ్, బీవై నగర్‌లో రోడ్లు, మురికి కాలువలు వంటి అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. రవీందర్‌ని ఆదర్శంగా తీసుకుంటూ ప్రతి ఒక్కరూ తమ వార్డులలో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకొని విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. తనతోపాటు పనిచేసిన కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు కొండ నరేష్, మేర్గు శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు అంకారపు రాజు, కంభోజ శ్రీధర్, నరసయ్య, కార్యదర్శులు కోడం రవి, సూరం వినయ్, ఎనగంటి నరేష్, గాజుల సదానందం, ఊరగొండ రాజు, గుడ్ల విష్ణు, సుంకోజు రమేష్ చారి, సుంకరి బాలకిషన్, మొగిలి రాజు, పండగ మాధవి, వేముల వైశాలి తదితర భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.


## ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్




**తెలంగాణ సేన,వేములవాడ,జూన్ 29 ::** కోనరావుపేట మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆది శీనన్న సారధ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేయడానికి యూత్ కాంగ్రెస్ ఎల్లప్పుడు ముందుండాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు.అలాగే మండల సినియార్ నాయకులతో మామెకమైతు యూత్ కాంగ్రెస్ సిద్దాంతాలను అనుసరిస్తూ ముందుకు సాగాలని కోరారు.వేములవాడ నియోజకవర్గానికి ఎప్పుడు లేని విధంగా అభివృద్ధి చేస్తున్నటువంటి ఎమ్మెల్యే ఆది శీనన్న గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి అభివృద్ధి పథకాన్ని ప్రజలకు చేరే విధంగా యూత్ కాంగ్రెస్ పని చేయాలని ఆయన కోరారు. రాబోయే రోజుల్లో పార్టీ తీసుకునే కార్యాచరణకు యూత్ కాంగ్రెస్ ముందుండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు అబ్బసాని దినేష్, మూలిగే నవీన్, నక్క నవీన్, సూర్య ప్రశాంత్, బానోత్ అరుణ్, గొల్లపల్లి నవీన్, కూర నవీన్, సృజన్, చల్ల మురళి, దప్పుల కార్తీక్, గడ్డం శేఖర్, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, రాకేష్, సతీష్, గణేష్, వేణు,తదితరులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శౌర్య పతాకం జనగాం

**పాశం యాదగిరి ( సీనియర్ జర్నలిస్టు)**



జనగాం గడ్డ అంటేనే శౌర్య పతాకం. హిమాలయాలంత ఉత్తుంగ తరంగమై రెపరెపలాడుతున్న నేల. శూరుల రక్తముతో తడిసి పునీతమైన భూమి. మొగలులను ఎదిరించిన కాకతీయులు, సర్వాయి పాపన్న, కాకతీయులను ఎదిరించిన పగిడిద్ద రాజు, జంపన్న,

సమ్మక్క- సారక్కలనుకన్న నేల. 17వ శతాబ్దంలో అన్ని కులాలను ఏకం చేసి బలాఢ్యమైన సైన్యాన్ని నిర్మించి మొఘల్ బాదుషాల వెన్నులో వణుకు పుట్టించిన సర్వాయి పాపన్న జనగామ శౌర్య ప్రతీక. సర్వాయి పాపన్నను కీర్తిస్తూ మొగల్ చరిత్రకారుడు ఖైతిఖాన్,

ఆ తర్వాత ఇంగ్లాండ్ పరిశోధకులు "బార్బరా" తర్వాత "థామస్ మెడ్ కాఫ్", రిచర్డ్ యీటన్ మొదలగు వారు పరిశోధనలు చేసి, విడివిడిగా సర్వాయి పాపన్న వీరత్వం పై పుస్తకాలు రచించారు. పాపన్న పోరాట పటిమపై తాటికొండ నుంచి ఖిలాషాపూర్ దాకా జనగాం చుట్టూ ఉన్న గ్రామాలలో జానపద గీతాలతో కథలతో పాపన్న కీర్తిని ప్రస్తుతించారు. మాది కూడా ఖిలాషాపురేనని చరిత్ర పరిశోధకులు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి, ఆచార్య పేర్వారం జగన్నాథం ఆయన తమ్ముడు మాజీ డిజిపి పేర్వారం రాములు ఘనంగా చెప్పుకుంటారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన వీరుడు కల్లుగీసినా, కత్తి దూసినా ఖిలాషాపూర్ ఘనతే. కానీ? సర్వాయ్ పాపన్నను నేడు గౌడ కులానికే పరిమితం చేయడం దురదృష్టం. అన్ని కులాలను ఏకం చేసి లింగ వివక్ష అంతం చేసిన బసవేశ్వరుని బాటలోనే పండితారాధ్యుడు, సోమనాథుడు అన్ని రకాల వివక్షతలను రూపుమాపాడు. బందగీ,చాకలి ఐలమ్మ దొడ్డి కొమురయ్య, గబ్బెట గోపాల్ రెడ్డి, గబ్బెట తిరుమల్ రెడ్డి, ధర్మపురం గిరిజన వీరులు ఠాను నాయక్, సోమ్లానాయక్, దర్యా నాయక్ వీరి తండ్రి హోము నాయక్ మరెందరో జనగామ జిల్లా రైతాంగ సాయుధ పోరాటంలో ఘనమైన పాత్ర వహించారు. జనగాం నుంచి ఎటు 50 కిలోమీటర్లు పయనించినా ఊరురా వీరుల స్మారకాలు,స్తూపాలు దర్శనమిస్తాయి. పాలకుర్తి,దేవరుప్పుల, నీర్మాల, కడవెండి,భైరాన్ పల్లి, వడ్లకొండ,కూటిగల్లు,ఆకునూరు. ఇంకా అనేక గ్రామాలలో అమరవీరులు తమ రక్తంతో "శాఖ" పోసిన జ్ఞాపకాలు గుర్తుకు వస్తాయి. అందుకే మేము కొన్ని ఏండ్ల పాటు "శౌర్య యాత్రలు" తెలంగాణ అంతటా వీరులు పోరాడిన గడ్డమీద జరిపి, వీరులను స్మరించి మా కన్నీటితో మా అంతరాత్మలను శుద్ధి చేసుకున్నాము.

జనగామ పక్కనే ఉన్న చిన్నమడూరుకు, సింగరాజుపల్లెకు శీతాకాలంలో సుమారు5,600 కిలోమీటర్ల దూరం నుంచి రష్యాలోని సైబీరియా కొంగలు వస్తాయి. చిన్నమడూరు మఠం చెట్టుపై గుడ్లు పెట్టి పిల్లలు పొదుగుతాయి. ఇది వేల సంవత్సరాలుగా సాగుతోంది. ఇక్కడి నుండి వీరుల గాధలను రష్యాకు మోసుకుపోతాయి. రష్యా నుండి విప్లవ సందేశాన్ని ఇక్కడికి ప్రతి ఏటా మోసుకొస్తాయి.

జనగాం జిల్లా చరిత్రను "సలాం జనగాం" జిల్లా చారిత్రక పరిమళం పేరుతో చరిత్రనంతా శోధించి గ్రంథస్థం చేస్తున్న మిత్రుడు సాంబరాజు యాదగిరికి హృదయపూర్వక శుభాకాంక్షలు.